# ఎమ్మెల్యే శంకరన్న కృషితోనే డంపింగ్ యార్డ్ పీడ విరగడయింది

**● ఈ ప్రాంత ప్రజలుగా ఆయనకు రుణపడి ఉంటాం ● కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి ● బిఆర్ఎస్ చేసిన తప్పిదం వల్లే ఈ గందరగోళ పరిస్థితులు ● డంపింగ్ యార్డ్ జేసీ అధ్యక్షుడు అంబటి ప్రభాకర్ ● ప్రతిపక్షాలు కావాలనే కాంగ్రెస్ పై బురదజల్లేందుకు ప్రయత్నించాయి ● సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ ● కొత్తూరు మున్సిపాలిటీలో విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు వెల్లడి**

**తొలి అక్షరం/కొత్తూర్, జూన్ 11:** ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన కృషివల్లే డంపింగ్ యార్డ్ పీడ విరగడైందని కాంగ్రెస్ పార్టీ కొత్తూరు మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి అన్నారు. డంపింగ్ యార్డ్ సిద్దాపూర్ కు వస్తుందని తమకు పత్రికల ద్వారానే తెలిసిందని శేఖర్ రెడ్డి చెప్పారు. అప్పటి నుంచి తాము ఎమ్మెల్యే పై ఎంతో ఒత్తిడి తెచ్చామని అన్నారు. అయిన ఎమ్మెల్యే ఎంతో ఓపికగా మా సమస్యను పరిష్కరించాలని ఈ పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఆయనకు రుణపడి ఉంటారని చెప్పారు. ఎమ్మెల్యేగా వీర్లపల్లి శంకర్ గెలవడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని చెప్పారు. లక్ష్మీదేవి పల్లి ప్రాజెక్టుతో సహా డంపింగ్ యార్డ్ సమస్య కూడా శంకరన్న వల్లే పరిష్కరించబడిందని చెప్పారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పొరపాటు వల్లే డంపింగ్ యార్డ్ సమస్య వచ్చి పడిందని డంపింగ్ యార్డ్ జేఏసీ అధ్యక్షుడు అంబటి ప్రభాకర్ అన్నారు. టీజీఐసీకి ఈ ప్రాంత రైతులు భూములు ఇచ్చినప్పుడు అందులో గత బిఆర్ఎస్ ప్రభుత్వం జనరల్ అని రాయడం వల్లే డంపింగ్ యార్డ్ ప్రతిపాదన వచ్చిందని చెప్పారు. అప్పుడే ఈ భూములు వేటి కోసం కేటాయిస్తున్నాము ఆ ప్రభుత్వం చెప్పి ఉంటే ఈ గందరగోళం ఉండేది కాదన్నారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ప్రాంత ప్రజలందరూ పొల్యూషన్ లేని పరిశ్రమలు పెట్టాలని కోరుకుంటున్నామని ఆయన చెప్పారు.

**కావాలనే ప్రతిపక్షాలు కాంగ్రెస్పై బురద చల్లాయి: సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్**

ప్రతిపక్షాలు కాంగ్రెస్పై డంపింగ్ యార్డ్ విషయంలో లేనిపోని నిందలు మోపారని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ విమర్శించారు.



ప్రభుత్వంలో కాంగ్రెస్ ఉన్నందున కాంగ్రెస్పై ఏ ఆరోపణలు చేసిన నిజమవుతాయని వారు నమ్మారన్నారు. కానీ ఈ సమస్యను కాంగ్రెస్ పార్టీ పరిష్కరించిందని చెప్పారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు అనవసర నిందలను కాంగ్రెస్ పార్టీపై వేయొద్దని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుమార స్వామి గౌడ్, సర్పంచులు గోవింద్ నాయక్, మంకాల శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ శంకర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుల బుచ్చయ్య, ఆకుల జ్ఞానేశ్వర్, సిద్దు గౌడ్, విశాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పోలీస్ కళా జాగృతి ఆధ్వర్యంలో అవగాహనా

**డ్రగ్స్ రహిత మండలంగా తీర్చి దిద్దాలి**

**సైబర్ నేరాలపై మహిళల భద్రత రోడ్డు ప్రమాదాలపై కళా జాగృతి నాటకాలు: నిర్వహించిన ఎస్ఐ ప్రమోద్ కుమార్**

**తొలి అక్షరం/పెద్దవంగర జూన్ 11:** మండలంలోని పోచారం గ్రామం లొ నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ పోలీస్ కళా జాగృతి పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమం ఈరోజు మన పెద్దవంగర మండలానికి వచ్చింది. ఇప్పుడే మన కళాకారులు బుర్రకథ, వీధి నాటకం, పాటల ద్వారా డ్రగ్స్, సైబర్ నేరాలు, మహిళల భద్రత గురించి ఎంత చక్కగా చెప్పారో చూశారు. అన్నారు లాఠీ కాదు – కళతో మార్పు పోలీస్ అంటే లాఠీ, కేసు, జైలు అనే భయం ఉంది. ఆ భయం పోగొట్టి, చట్టంపై అవగాహన కల్పించేందుకే డి జి పి మన ఎస్పీ శబరిష్ పోలీస్ కళా జాగృతి" మొదలుపెట్టారు. పాటతో చెప్పిన నీతి మనసుకు హత్తుకుంటుంది. నాటకంలో చూపిన నిజం కళ్లకు కడుతుంది. ఇవాళ మీరు చూసిన గంజాయి బానిస స్కిట్ కల్పితం కాదు. అది మన ఊరిలో, మన పక్క వీధిలో జరుగుతున్న



నిజం. చేదు నిజం – మన ఇంటి గుమ్మం వద్దకు వచ్చిన ముప్పుమన పెద్దవంగర మండలం తొర్రూర్ హైదరాబాద్ హైవేపై ఉండటంతో గంజాయి రవాణాకు అడ్డాగా మారుతోంది. అన్నారు డ్రగ్స్ రహిత మండలంగా తీర్చటమే మన బాధ్యత అన్నారు మీ పాత్ర – మీరే మార్పు ముఖ్యముగా విద్యార్థులు : "ఒక్కసారి ట్రై చేద్దాం రా" అనే వాడు నీ శత్రువు. "వద్దు రా" అని ధైర్యంగా చెప్పేవాడే నిజమైన స్నేహితుడు. మీకు ఏ సమస్య వచ్చినా భయపడకుండా మీ టీచర్‌కు, మాకు చెప్పండి. డయల్ 100 మీ కోసమే. మీ చదువు, మీ కలలు మాకు ముఖ్యం. పోలీస్‌కు లాఠీ ఉంది, మీకు కవిస్తృత ప్రచారం ఇవాళ ఇక్కడ జరిగిన పాటలు, నాటికలను మీ ఛానల్‌లో, పేపర్‌లో, వాట్సాప్ గ్రూపుల్లో పెట్టండి. ఒక వీడియో లక్ష మందికి చేరుతుంది. అవగాహన అంటే ఇదే. నిఘా నేత్రం మీరు ప్రతి గ్రామం తిరుగుతారు. ఎక్కడ గంజాయి దొరుకుతోంది, ఎవరు అమ్ముతున్నారు, ఏ టైమ్‌లో సప్లై అవుతోంది మీకు తెలుస్తుంది. ఆ సమాచారం నాకు వాట్సాప్ చేయండి. అన్నారు ఇది నా హామీ అన్నారు ఈ కళా జాగృతి వేదికగా నేను మీకు 5 హామీలు ఇస్తున్నాను: డయల్ 100 24 గంటలు. 10 నిమిషాల్లో మీ ముందు ఉంటాం. షీ టీమ్ ఆడపిల్లలను ఎవరైనా వేధిస్తే 181కు కాల్ చేయండి. వారం తిరగక ముందే వాడి పని పడతాం. సైబర్ 1930 ఫోన్‌కు వచ్చిన లింక్ క్లిక్ చేయకండి. ఓటీపీ చెప్పకండి. మోసపోతే వెంటనే 1930కు కాల్ చేయండి మీ స్నేహితుడు పోలీస్ స్టేషన్‌కు రావడానికి భయపడవద్దు. మేము మీ సేవకులం. మీ రక్షణ మా బాధ్యత కళతో మొదలైన ఈ చైతన్యం, చట్టంతో ముగియాలి. ఇవాళ మీరు చూసిన నాటకం, విన్న పాట మీ గుండెల్లో నిలిచిపోవాలి. మీ ఇంట్లో, మీ వీధిలో, మీ గ్రామంలో గంజాయి లేకుండా చేయడమే ఈ కార్యక్రమం విజయం. రండి, అందరం కలిసి ప్రతిజ్ఞ చేద్దాం: మన పెద్దవంగర మండలాన్ని డ్రగ్స్ రహిత, నేర రహిత, భయ రహిత మండలంగా మారుస్తాం అన్నారు ఈ కార్యక్రమం లొ గ్రామ సర్పంచ్ శ్యామ్ సందర్ రెడ్డి ఉపసర్పంచ్ సీతారామ్ నాయక్ ప్రజలు పాల్గొన్నారు

# రెండు రోజుల్లో మృతదేహాలు స్వదేశానికి : ఎమ్మెల్యే సత్యం

**● దుబాయ్‌లో ఎం.బి.సి అధికారులతో ఎమ్మెల్యే భేటీ**

**● రషీద్ ఆసుపత్రిలో క్షతగాత్రుడిని పరామర్శించిన ఎమ్మెల్యే**

**● బాధిత కుటుంబాలకు తెలంగాణ సర్కార్ అండ : ఎమ్మెల్యే సత్యం**



**తొలి అక్షరం/దుబాయ్ జూన్ 11:** దుబాయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గ వాసుల మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు దుబాయ్ వెళ్లిన చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం నేడు ఉదయం దుబాయ్‌లోని ఎం.బి.సి అధికారులతో సమావేశమయ్యారు. మృతదేహాలను భారత్‌కు తరలించడంలో కొన్ని సాంకేతికపరమైన అంశాలు ఉన్నందున వాటిని రెండు రోజులలో పూర్తి చేసి మృతదేహాలను స్వదేశానికి పంపిస్తామని అధికారులు తెలిపినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రషీద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముత్యంపేటకు చెందిన సయ్యద్ ని ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని, తెలంగాణ ప్రభుత్వం మీకు అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. త్వరలోనే భారత్‌కు తిరిగి వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వారికి తెలియజేశారు.

# సీతారాంపురం గ్రామ నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలి

**● రూ.4.17 లక్షల వ్యయంపై మాజీ సర్పంచ్ ఆరోపణలు ● గ్రామస్థులతో కలిసి ఎంపీడీఓకు ఫిర్యాదు ● చేయని పనులకు బిల్లులు తీసుకున్నారని విమర్శ ● ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం ● విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ హామీ ● నిబంధనల ప్రకారమే విధులు నిర్వహిస్తున్నానన్న ఎంపీవో**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జూన్ 11:** నెల్లికుదురు మండలంలోని సీతారాంపురం గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందంటూ వచ్చిన ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. గ్రామ పంచాయతీ నిధుల వినియోగంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బొడ్డం సోమేశ్వరి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం గ్రామస్థులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని ఎంపీడీఓ సింగారపు కుమార్ కు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. అనంతరం కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో చేపట్టని కొన్ని పనులకు సైతం రికార్డులు సృష్టించి సుమారు రూ. 4.17 లక్షల మేర బిల్లులు పొందినట్లు అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. ఎంబీ రికార్డులు సర్పంచ్ పేరుతో నమోదు అయినప్పటికీ, సంబంధిత నిధులు గ్రామ కారోబార్ ఖాతాలోకి మళ్లించడం వెనుక ఉన్న కారణాలు ఏమిటో ప్రజలకు తెలియజేయాలని ప్రశ్నించారు.




గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసే నిధులను పారదర్శకంగా వినియోగించాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉందని, అయితే ఈ విషయంలో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. గ్రామ నిధుల విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కనిపించలేదని చంద్రారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల డబ్బు ఎలా ఖర్చు అయిందో పూర్తిస్థాయిలో పరిశీలించి వాస్తవాలను వెలికితీయాలని, తప్పు చేసిన వారెవరైనా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యపై వివరణ కోరేందుకు వెళ్లిన తమతో కొందరు అధికారులు దురుసుగా ప్రవర్తించడం కూడా బాధాకరమని అన్నారు.

**విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం: ఎంపీడీఓ సింగారపు కుమార్**

ఫిర్యాదుపై స్పందించిన ఎంపీడీఓ సింగారపు కుమార్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన ఆరోపణలను పరిశీలిస్తామని తెలిపారు. పై అధికారుల ఆదేశాల మేరకు సంబంధిత రికార్డులను తనిఖీ చేసి



సమగ్ర విచారణ నిర్వహిస్తామని చెప్పారు. విచారణలో ఏవైనా అవకతవకలు తేలితే నిబంధనల ప్రకారం బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**నిబంధనల ప్రకారమే పని చేస్తున్నాను: ఎంపీవో బానోత్ పద్మ**

ఈ వ్యవహారంపై వివరణ కోరగా ఎంపీవో బానోత్ పద్మ మాట్లాడుతూ, తాను ఎవరిపైనా ఉద్దేశపూర్వకంగా దురుసుగా ప్రవర్తించలేదని తెలిపారు.

విధి నిర్వహణలో భాగంగా ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారమే అన్ని పనులు చేస్తున్నానని చెప్పారు. తనకు ఎవరితోనూ వ్యక్తిగత విభేదాలు లేదా ద్వేషాలు లేవని, ఆరోపణలపై అధికారులు చేపట్టే విచారణకు పూర్తిగా సహకరిస్తానని పేర్కొన్నారు. గ్రామ నిధుల వినియోగంపై వచ్చిన ఈ ఆరోపణలు ప్రస్తుతం సీతారాంపురం గ్రామంలో తీవ్ర చర్చకు దారితీస్తుండగా, అధికారుల విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి రావాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా తెలంగాణ రక్షణ సేన జెండా పండుగ




**తొలి అక్షరం/మానకొండూర్ జూన్ 11:** తెలంగాణ రక్షణ సేన జెండా పండుగలో భాగంగా మానకొండూరు నియోజకవర్గంలోని శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామంలో గురువారం జెండా పండుగ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల నాయకులు చిట్టెంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా బాధ్యులు గుంజపడుగు హరిప్రసాద్, మానకొండూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుడిగె పర్శారం గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర హక్కులు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకురాలు యండి సల్మా, అత్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, జిల్లా సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, జిల్లా బీసీ విభాగం అధ్యక్షులు శ్రీరాముల రమేష్, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, మానకొండూరు నియోజకవర్గ అబ్జర్వర్ మల్లారెడ్డి, శాతవాహన యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు చెన్నమల్ల చైతన్య, రాష్ట్ర నాయకులు వెలిగేటి రవికుమార్, జిల్లా నాయకులు బాసవేని రాజేందర్, గర్శకుర్తి విద్యాసాగర్, యండి ఉమర్, కొండపాక రాకేష్, మనుపాటి రమేష్, సుజీత్, మహిళా విభాగం జిల్లా సీనియర్ నాయకురాలు జంగ అపర్ణ, అంజలి, డీటీ శిరీష, రమేష్, కవిత తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.

## తెలంగాణ ఉద్యమకారుడు పప్పు సంపత్‌ను పరామర్శించిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా బృందం




**తొలి అక్షరం/కరీంనగర్, జూన్ 11:** గత కొద్ది రోజులుగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న పోలంపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు పప్పు సంపత్‌ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ జిల్లా బృందం పరామర్శించింది. బ్రెయిన్ ట్యూమర్‌కు సంబంధించి శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు తరలించిన పప్పు సంపత్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఫోరం నాయకులు, ఆయనను కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంపత్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉద్యమంలో పప్పు సంపత్ చేసిన సేవలను గుర్తు చేసుకున్న నాయకులు, ఆయన ఆరోగ్యం మెరుగుపడాలని ఆకాంక్షిస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర నాయకులు గరిగే కోటేశ్వర్, బండారి కుమార్‌తో పాటు పలువురు ఉద్యమకారులు, నాయకులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# లైసెన్స్ లేకపోతే బ్రేకే..
# మైనర్లు నడిపితే జైలే...

- లైసెన్స్ లేకుండా బండి తీస్తే బారికేడే
- మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్
- ఒక్కరోజే 1,496 కేసులు.. రూ.2,99,500 జరిమానా
- మైనర్ డ్రైవింగ్‌పై 17 కేసులు..కోర్టుకు చార్జ్‌షీట్లు
- తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తప్పవు
- మల్కాజ్‌గిరి ట్రాఫిక్ డీసీపీ హెచ్చరిక

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు) ,జూన్11:** రోడ్డు భద్రతను పటిష్టం చేయడమే లక్ష్యంగా,మోటారు వాహనాల చట్ట నిబంధనలను ఉల్లంఘించే వారిపై మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. కమిషనరేట్ పరిధిలోని జోన్-1, జోన్-2 పరిధుల్లోని అన్ని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలో గురువారం 'లైసెన్స్ లేని ప్రయాణం', 'మైనర్ డ్రైవింగ్' లపై ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు.. ట్రాఫిక్ డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐల ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన జంక్షన్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.




| S.No | Tr.PS/Div./Zone | W/o Driving License Cases | W/o Driving License Amount | W/o Carrying Driving License Cases | W/o Carrying Driving License Amount | W/o Documents Cases | W/o Documents Amount | Minor Driving (Charge Sheet) | Grand Total Total Cases | Grand Total Total Amount |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | Malkajgiri Tr. PS | 31 | 15500 | 42 | 4200 | 37 | 3700 | | 110 | 23400 |
| 2 | Gopalpuram Tr. PS | 20 | 10000 | 42 | 4200 | 86 | 8300 | 3 | 151 | 22500 |
| 3 | Jawaharnagar Tr. PS | 7 | 3500 | 51 | 5100 | 52 | 5200 | | 110 | 13800 |
| 4 | Trimulgherry Tr PS | 24 | 12000 | 42 | 4200 | 33 | 2900 | 4 | 103 | 19100 |
| 5 | Alwal Tr PS | 56 | 28000 | 31 | 3100 | 21 | 2000 | 1 | 109 | 33100 |
| 6 | Begumpet Tr PS | 56 | 28000 | 101 | 10100 | 66 | 6100 | 5 | 228 | 44200 |
| | Zone I Total | 194 | 97000 | 309 | 30900 | 295 | 28200 | 13 | 811 | 156100 |
| 1 | LB Nagar Tr. PS | 31 | 15500 | 58 | 5800 | 92 | 9200 | | 181 | 30500 |
| 2 | Vanasthalipuram Tr. PS | 37 | 18500 | 31 | 3100 | 62 | 5900 | 3 | 133 | 27500 |
| 3 | Uppal Tr. PS | 64 | 32000 | 78 | 7800 | 24 | 2400 | | 166 | 42200 |
| 4 | Kushaiguda Tr. PS | 28 | 14000 | 22 | 2200 | 35 | 3400 | 1 | 86 | 19600 |
| 5 | Ghatkesar Tr. PS | 25 | 12500 | 26 | 2600 | 85 | 8500 | | 136 | 23600 |
| | Zone II Total | 185 | 92500 | 215 | 21500 | 298 | 29400 | 4 | 702 | 143400 |
| | TOTAL | 379 | 189500 | 524 | 52400 | 593 | 57600 | 17 | 1513 | 299500 |



### ఒక్కరోజే భారీగా కేసులు..

ఈ ప్రత్యేక డ్రైవ్‌లో సరైన డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు, వెంట పత్రాలు(డాక్యుమెంట్లు) ఉంచుకోని వాహనదారులపై మొత్తం 1,496 కేసులు నమోదు చేశారు. వీరికి రూ.2,99,500 ల భారీ జరిమానా విధించారు. అలాగే, అత్యంత ప్రమాదకరమైన రీతిలో వాహనాలు నడుపుతున్న 17 మంది మైనర్లను (పిల్లలను) పోలీసులు పట్టుకున్నారు. ఈ మైనర్ డ్రైవింగ్ కేసులన్నింటిపై చట్ట ప్రకారం చార్జ్‌షీట్లు దాఖలు చేసి, కోర్టుకు పంపనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

### మీ పిల్లలకు బండి ఇస్తే జైలుకే:

సరైన శిక్షణ, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టవిరుద్ధం. మరీ ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వడం తీవ్రమైన నేరం. వారి అపక్వత, అవగాహనా లోపం వల్ల ప్రాణాంతక ప్రమాదాలు జరుగుతున్నాయి. తల్లిదండ్రులు లేదా వాహన యజమానులు ఎట్టి పరిస్థితుల్లోనూ మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదు. ఒకవేళ ఇస్తే, వారికి చట్టపరమైన కఠిన శిక్షలు తప్పవు.

**- ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ), మల్కాజ్‌గిరి.**

పౌరులంతా బాధ్యతాయుతంగా వ్యవహరించి, కేవలం లైసెన్స్ ఉన్నవారిని మాత్రమే వాహనాలు నడపనివ్వాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రాణాల రక్షణ కోసం ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# చేనేతను ఆదుకోండి: ఈగ మల్లేశం డిమాండ్

- టెండర్ విధానాన్ని రద్దు చేసి, జీవో నెం. 1ను పునరుద్ధరించాలి
- వరంగల్‌లో ఏడో రోజుకు చేరిన చేనేత కార్మికుల నిరసన దీక్ష

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూన్11:** చేనేత రంగం రాష్ట్రంలో వేలాది కుటుంబాలకు జీవనాధారమని, ఆ రంగాన్ని కుదేలు చేసేలా ఉన్న టెండర్ విధానాన్ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని అఖిల భారత పద్మశాలి సంఘం పూర్వ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం డిమాండ్ చేశారు. చేనేత ఉత్పత్తుల కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన టెండర్ విధానాన్ని వ్యతిరేకిస్తూ వరంగల్ జిల్లా చేనేత కార్మికులు చేపట్టిన నిరసన దీక్ష గురువారంతో ఏడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన, కార్మికులకు తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు.







### నేరుగా కొనుగోళ్లు చేపట్టాలి:

ఈ సందర్భంగా ఈగ మల్లేశం మాట్లాడుతూ.. చేనేత ఉత్పత్తుల కొనుగోలులో ప్రస్తుతం ప్రవేశపెట్టిన టెండర్ విధానాన్ని రద్దు చేసి, గతంలో ఉన్నట్లుగానే టెస్కో ద్వారా చేనేత సహకార సంఘాల నుండి నేరుగా కొనుగోళ్లు జరపాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం గనుక తక్షణమే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, అవసరమైతే టెస్కో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

### జీవో నెం. 1తోనే కార్మికులకు రక్షణ:

గతంలో అమల్లో ఉన్న జీవో నెం. 1 ప్రకారం.. టెస్కో నేరుగా చేనేత సహకార సంఘాల నుంచి బెడ్‌షీట్లు, జంపఖానాలను కొనుగోలు చేసి ప్రభుత్వ హాస్టళ్లకు సరఫరా చేసేది. కానీ ప్రస్తుత టెండర్ విధానం వల్ల చేనేత సంఘాలకు అవకాశాలు లేకుండా పోయాయి. దీనివల్ల కార్మికులు నేసిన కోట్లాది రూపాయల ఉత్పత్తులు నిలిచిపోయి, గత రెండు నెలలుగా ఉపాధి కోల్పోయారు.

### మగ్గాలు బంద్.. ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబాలు: ఈగ మల్లేశం

ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో లక్షలాది మంది ఈ వృత్తిపైనే ఆధారపడి ఉన్నారని, ముఖ్యంగా వరంగల్ జిల్లా బెడ్‌షీట్లు, జంపఖానాల తయారీకి ప్రత్యేక గుర్తింపు పొందిందని ఆయన గుర్తుచేశారు. దాదాపు 10 వేల మంది కార్మికులు ఈ రంగంలో ఉన్నారని, సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఈ నెల 1వ తేదీ నుండి కార్మికులు మగ్గాలను బంద్ చేసి నిరసన తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఫలితంగా వేలాది కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### ముఖ్యమంత్రి తక్షణమే చొరవ చూపాలి:

చేనేత కార్మికుల జీవనోపాధిని కాపాడేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే చొరవ చూపాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. పాత పద్ధతిలోనే జీవో నెం.1ను పునరుద్ధరించి, ప్రభుత్వ హాస్టళ్లకు అవసరమైన దుస్తులను చేనేత సంఘాల నుంచే సేకరించాలన్నారు. ఈ నిరసనలో చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీర మోహన్, నాయకులు వద్నాల నరేందర్, ఆడెపు రవీందర్, బచ్చు ఆనందం, గోరంట్ల రాజు, చిప్ప వెంకటేశ్వర్లు, డి.ఎస్. మూర్తి, బేతి అశోక్, బైరి శ్యామ్, యెలుగం చిన్న కొమురయ్య, యెలుగం భద్రయ్య, మేగ రాజు, కుమారస్వామి, శ్రీనివాస్‌లతో పాటు చేనేత కార్మిక సంఘాల బాధ్యులు, పెద్ద సంఖ్యలో చేనేత మహిళా కార్మికులు పాల్గొన్నారు.

# ప్రత్తి సాగులో 'కొత్త' బాట

- అంతర పంటలతోనే భరోసా
- తేలికపాటి భూముల్లో 'అధిక సాంద్రత' సాగు వైపు అడుగులు
- మడిపల్లిలో ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి అవగాహన సదస్సు
- 50 మంది రైతులకు జాతీయ ఆహార భద్రత మిషన్ కింద ఉచితంగా ఉత్పాదకాల పంపిణీ

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో- తొర్రూర్ ప్రతినిధి(పి.సాంబ పస్తం),జూన్11:** సాంప్రదాయ పద్ధతులతో ప్రత్తి సాగు చేసి నష్టపోవద్దని, ఆధునిక యాజమాన్య పద్ధతులు, అంతర పంటల సాగుతోనే ప్రత్తిలో అధిక లాభాలు సాధించవచ్చని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్) అసోసియేట్ డైరెక్టర్ రీసెర్చ్ డాక్టర్ ఎం. శ్రీధర్ పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని మడిపల్లి గ్రామంలో గురువారం ప్రత్తి నూతన యాజమాన్య పద్ధతులపై ప్రదర్శన క్షేత్ర కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రామలింగం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో శాస్త్రవేత్తలు రైతులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ....జాతీయ ఆహార భద్రత మిషన్ (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) కింద ఎంపిక చేసిన 50 మంది రైతులకు ప్రదర్శన క్షేత్రాల నిర్వహణకు గానూ ఉచితంగా విత్తనాలు, సమగ్ర సస్యరక్షణ ఉత్పాదకాలను అందజేసినట్లు తెలిపారు. **రైతులకు శాస్త్రవేత్తల 'మేలైన' సూచనలు** వరంగల్ ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రత్తి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ వి. వెంకన్న, జాతీయ ఆహార భద్రత మిషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్సల్టెంట్ పి. సారంగంలు రైతులకు వివరించిన సాగు మెలకువలు:**తేమ చూశాకే విత్తనం:** భూమిలో తగినంత తేమ ఉండేలా కనీసం 70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతనే విత్తనాలు విత్తుకోవాలి. మొలక శాతం తగ్గి ఖాళీలు ఏర్పడితే, తదుపరి వర్షం పడిన వెంటనే 'గ్యాప్ ఫిల్లింగ్' చేయాలి. **దుక్కిలోనే భాస్వరం:** ఎకరానికి ఒక బస్తా డీఏపీ లేదా మూడు బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎస్‌ఎస్పి ఎరువును ఆఖరి దుక్కిలో లేదా విత్తిన 20 రోజు లోపు మాత్రమే పదును చూసి వేయాలి. ఆ తర్వాత పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులను అస్సలు వాడకూడదు. **నాలుగు దఫాల ఫార్ములా:** విత్తిన 20, 40, 60, 80 రోజులకు (4 విడతలుగా) ఎకరానికి 25-30 కిలోల యూరియా + 10-15 కిలోల పొటాష్ చొప్పున కలిపి వేసుకోవాలి. **లాభదాయకమైన 6:1 నిష్పత్తి:** ప్రత్తి పంటలో అంతర పంటగా కందిని 6:1 నిష్పత్తిలో (6 వరుసల ప్రత్తికి ఒక వరుస కంది) సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చు. **ప్రత్యేక ఆకర్షణ:** తేలిక భూముల్లో 'అధిక సాంద్రత' సాగు తేలికపాటి భూములు ఉన్న రైతులు అధిక సాంద్రత పద్ధతిలో ప్రత్తిని సాగు చేయడం వల్ల తక్కువ కాలంలోనే ఎక్కువ దిగుబడి సాధించవచ్చని, మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో ఇది రైతులకు ఎంతో మేలు చేస్తుందని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. దీంతో పాటు ప్రత్తిని ఆశించే పురుగుల నివారణకు తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ పద్ధతులను క్షేత్రస్థాయిలో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీమతి మధుష, వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈఓ)ప్రవీణ్, గ్రామ అభ్యుదయ రైతులు,లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





